


# అనుక్షణం
## - సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గతసంచిక తరువాయి)

**వెంకటాద్రి చిన్నగా తలూపాడు.** శివ మళ్లీ ఆ సూట్ కేసుని తీసుకు వెళ్లి ఈ సారి కాఫీ తీసుకువచ్చాడు. ఇద్దరూ తాగుతున్నారు.

"ఇది నీతో పంచుకోవాలనిపించింది. ఇంతకు ముందు నేను కొంత మంది నుండి కొన్ని విషయాలు విన్నాను. అవి టాక్స్ కి చెందిన గొడవలు. లెక్కచూపని మనీ వుంటుంది. ఒక్కోసారి అదే కొంతమందిని లక్షాధికారుల్ని చేస్తుంది".

వెంకటాద్రి భ్రుకుటి ముడిపడింది.

"అలాంటి డబ్బుని గోతాల్లో కుక్కుతారు. అయితే వాటికి చెందిన గుర్తులు పెట్టుకుంటారు. ఓ సారి ఓ ఉల్లిపాయల బస్తాలో అప్పటికప్పుడు దాచి పంపారు. ఎవరికో దొరికాయి. అలాగే అలాంటి దాడులప్పుడు తీసుకెళ్లి ఏ నిర్జన ప్రదేశంలోనో పడేస్తుంటారు. అవి అక్కడే వుంటాయని చెప్పలేం కదా. ఇవన్నీ కల్పితాలు కాదు. కాస్త ఎగ్జాగరేషన్ వుంటుంది. అలాంటివి మన అనుభవంలోకి వచ్చినప్పుడు మాత్రం షాక్ అవుతాం".

"బాగుంది శివా... నువ్వు ఆరుగురు అనుమానితులు పుస్తకం చదవటం పూర్తి అయిందా?"

"అయింది. అయితే ఇంకో మిత్రుడు తీసుకున్నాడు".

"అదేంటి. నేను అడిగాను కదా!"

"నిజమే. అతను రచయిత. క్రైమ్ నవల రాయాలనుకుంటున్నాను. ఆ పుస్తకం దొరకటం లేదు అని బలవంతం చేశాడు. నువ్వు పెద్ద సీరియస్ రీడర్ వి కాదని నాకు తెలుసు కదా. మెల్లగా చదువుదువు గాని".

"తొందరేం లేదులే. ఇప్పుడు ఈ సూట్ కేసు విషయంలో నువ్వు కంగారు పడుతున్నావా?"

"అదేం లేదు. ఇంతకు మించి నా మిత్రుడు నన్ను ఉపయోగించుకోవాలని అనుకున్నాడనుకో. అప్పుడు కదా!"

"నాకు అర్థం కాలేదు".

"మా ఇంట్లో బిగ్ ఎమౌంట్ దాయాలనుకోవచ్చు. ఓ రెండు కోట్లు నీ దగ్గర వుంచు అన్నాడనుకో. అప్పుడు తప్పకుండా ఆలోచించాల్సి వుంటుంది. ముందు మనలాంటి వాళ్లం అది కాపాడటం కష్టం. మనకి నిద్రపట్టదు. ఏ దొంగతనమో జరిగింది. అది నమ్మాలి కదా. మనమే మాయం చేసి కథలు చెబుతున్నాం అనుకోవచ్చు. ఈ మధ్య ఎవరో చాలా కాలం నుండి కష్టపడి ఇల్లు కొనుక్కుందామనుకుని దాచుకున్నాడు. అవన్నీ చెదలు పట్టాయి. ఎలుకలు కూడా ముక్కలు ముక్కలుగా కొరికేశాయంట. అతని పరిస్థితి ఏంటి? జీరో నుండి మళ్లీ మొదలు పెట్టాలి. అంతకు మించి బ్యాంకులో దాచుకోవాలన్న విషయం తెలియని వారుండటం విశేషం కదా!"

"అయ్యో" అన్నాడు వెంకటాద్రి.

"ఇలాంటివి జరుగుతుంటాయి. అయ్యో అన్నా లేదు. పాపం అన్నా లేదు. ఎవరూ చేయగలిగింది ఏం లేదు గాని మీ బాస్ ఏం అంటున్నారు?"

"ప్రత్యేకంగా ఏమీ లేదు. ఎందుకు అడుగుతున్నావు?"

"మా ఫ్రెండ్ లోనూ మీ బాస్ లోనూ కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి"

"నాకు అర్థం కాలేదు".

"తను నిన్ను పార్ట్నర్ గా చేర్చుకుంటాడు" అనగానే సహజంగానే వెంకటాద్రి ముఖం అదోలా అయిపోయింది.

అదేం గమనించకుండా శివ చెబుతున్నాడు.

"అందులో నువ్వు పెట్టుబడి పెడుతున్నావని నేను అనటం లేదు. అది మీ నిరంజన్ కి అవసరం లేదు కూడా. ఓ దశ దాటాక రకరకాల పేర్లతో కంపెనీలు ఫ్లోట్ చేసే విషయం ఎకౌంట్స్ వాళ్లకి తెలుస్తాయి. అలాగే బినామీలు. అందుకని మనకు తెలియకుండానే మనల్ని గమనిస్తుంటారు–ఇతను ప్రమాదకారా అని".

"ఇప్పుడు నాకు అర్థం అయింది. తీరా భాగస్వామ్యం ఇస్తే ఎదురు తిరగవచ్చని వారి అనుమానం అంటావు".

"అవును. అయితే వారి భరోసా వారికి వుంటుంది. అవసరం అనుకుంటే మనుషుల్ని లేపేస్తారు. చిన్న చిన్న ఎమౌంట్స్ కి కాదులే".

"మీ ఫ్రెండ్ కూడా నిన్నుబినామీని చేయబోతున్నాడు అంటావు".

"అలాంటి ఆలోచన వుండవచ్చు. అందులో భాగంగా సూట్ కేసు నా దగ్గర వుంచే అవకాశాన్ని కొట్టేయలేం. వ్యాపారం అంటూ మొదలు పెట్టాక ఇంక మామూలు విలువలు వుండవు".

"అలాంటి ఆఫర్ వస్తే నువ్వు ఒప్పుకుంటావా?"

"ఆలోచించాలి. చిన్న చిన్న వారుంటారు. దూరంగా పొలాలు కొంటారు. చిన్న చిన్న కమతాలకు లోన్లు వస్తుంటాయి. ట్రాక్టర్లు కొనటానికికని, ఇంకో రకంగా. అందులో సబ్సిడీలుంటాయి. అవన్నీ ముందే చెబుతారు. జనరల్ గా సమస్యల్లో వుంటారు. మనల్ని ప్రేమిస్తారు. అలాంటి వారికి ఉపయోగపడాల్సి వుంటుంది. అదీ రిస్కే".

"అంటే..."

"వాళ్ల డబ్బుతో కొన్నా మన పేరున వున్నప్పుడు ఇన్ కమ్ మనం చూపించాలి. అలాగే అవసరాలకు కొని అమ్ముతుంటారు లాభాలు వస్తే. అప్పుడు మనం రిజిస్ట్రేషన్ చేస్తాం. డబ్బులు వాళ్లు తీసుకుంటారు. కేపిటల్ గెయిన్స్ కట్టాలి. వాళ్లు కట్టకపోతే మనం కట్టాల్సి వుంటుంది. మంచికి పోతే చెడు ఎదురవుతుంది".

"అవన్నీ ముందు మాట్లాడుకోవాలి శివా".

"అనుకుంటాం. ఒక్కోసారి కుదరదు. మనం నాకు ఇష్టం లేదు అని చెబితే స్నేహాలు పోతాయి. మొహమాటానికి పోతే కొన్ని సంవత్సరాలు మనం పొదుపు చేసుకున్న కొద్ది పాటి మొత్తం కట్టాలి. అలాగే చిట్లకి గ్యారంటర్ గా వున్నా అంతే".

అప్పుడు వెంకటాద్రికి తను కడుతున్న చిట్స్ గుర్తు వచ్చాయి. శివ కూడా కడుతున్నాడు.

"మన వెంకట్ పరిస్థితి ఏంటి?" అడిగాడు వెంకటాద్రి.

"ఫర్వాలేదు. మనం కంగారు పడాల్సిన పని లేదు. అయినా రెండు చిట్స్ చివరి వరకూ వుంచటం మంచిది కాదు. ఒకదాన్ని పాడేసి అదే అతని దగ్గర వుంచితే వడ్డీ ఇస్తుంటాడు కదా!"

"రూపాయి పది పైసలు వడ్డీ"

"చాల్లే. రెండు రూపాయలు మూడు అంటే ఆశలు వదులుకోవాలి. ఈ రోజుల్లో అంత ఆదాయం రావటం లేదు. స్పెక్యులేషన్ ఎప్పుడూ డేంజర్" అన్నాడు శివ.

"మనం జాగ్రత్తగా ఆలోచించాక ఏ నిర్ణయం అయినా తీసుకుందాం" అన్నాడు వెంకటాద్రి.

"ఈ సారి బట్టలు ఒక్కరికే తీసుకున్నారేంటి?" అంది కళ్యాణి.

"నీ గురించి అనుకోలేదు. అయినా నీకు ఏ రంగులు నచ్చుతాయో నాకు తెలియదు కదా. నువ్వు ఎంత కావాలంటే అంత తీసుకుని చీరలు తీసుకో" అన్నాడు వెంకటాద్రి.

"నేను నా గురించి అడగటం లేదు. ఆదిత్యాకి బట్టలు తీసుకున్నప్పుడు దీప్తికి కూడా తీసుకోవచ్చు కదా అంటున్నాను".

"అవి ఆదిత్య కని ఎవరన్నారు. నా కోసం తీసుకున్నాను".

"మీ కోసమా!" నోరు తెరిచింది.

"అవును".

"బాగానే వుంది. ఈ వయసులో జీన్స్ ఫ్యాంట్ లు, ఆ షర్ట్లు వేసుకుంటే ఏం బాగుంటుంది?"

"అది నీ అభిప్రాయం. నేను నా స్టయిల్ మార్చుతున్నాను. ఇక్కడే కాదు బెంగళూరులో నా కంటే పెద్ద వాళ్లు, ముసలి వారు కూడా ఇంతకంటే బొమ్మల చొక్కాలు వాడుతున్నారు. మనం చేస్తున్న పనిని బట్టి మన డ్రెస్ లుంటే బాగుంటుంది" అన్నాడు.

కళ్యాణి ఇంకేం అనలేక "మీ ఇష్టం. అవి తొడుక్కునేది మీరు" అని మాత్రం అంది. అమ్మాయిని కలిసిన విషయం చెప్పాడు. తర్వాత శివ చెప్పిన విషయాలు మనసులోకి వచ్చాయి.

నిరంజన్ గురించి తను ఇప్పటిదాకా ఓ రకంగా ఆలోచిస్తున్నాడు. వాళ్ల కుటుంబంతో సన్నిహితం కావటం గురించి రకరకాల ఆలోచనలు వచ్చాయి. అయితే ఇది కూడా ఓ అంశం అయివుండాలి. తనను బినామీగా చూపించవచ్చు. అలాగే తన పేరు మీద ముందు ముందు షేర్స్ తీసుకున్నా ఆశ్చర్యం లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడ సంతకం చేయమంటే అక్కడ చేయటానికి తనకు అభ్యంతరం లేదు.

ఇంక ఈ పనులు చేసినందుకు తనకి ఏదొకటి చేయకపోదు. దాని కంటే ముందు ఓ పాతిక లక్షలు ఇన్వెస్ట్ చేస్తానని ఆయనకు చెప్పాలి. అంతకు ముందు ఓ పని చేయాలి. మొదటిది తిరుమల వెళ్లి రావటం. రెండవది నిరంజన్ తో పర్సనల్ గా మాట్లాడటం.

తిరుమల వెళ్లాలనుకున్నప్పుడు కళ్యాణితో కలిసి వెళ్తే ఇంట్లో డబ్బు వుంది. పిల్లలు వచ్చేదాకా ఆగి ఇద్దరం వెళ్లేంత సమయం లేదు. ఇంట్లో తను వుండాలి.

ఇదే విషయం నిరంజన్ కి చెప్పాడు.

"దాందేముంది వెళ్లిరా. అక్కడ నాకు తెలిసిన వారున్నారు. దగ్గరుండి దర్శనాలు చేయిస్తారు. అలాగే అన్ని ఏర్పాట్లు చేస్తారు. ఎప్పుడు వెళ్లాలనుకుంటున్నావు?" అన్నాడు.

"రేపు వెళ్తాను. కాదంటే ఎల్లుండి. ట్రైన్ టిక్కెట్లు దొరుకుతాయి".

"అంత టైట్ గా వుంటే ఫ్లయిట్ లో వెళ్లి రావచ్చు".

"వద్దు లెండి. నేను ట్రైన్ లో వెళ్తున్నాను".

"అదేంటి నీ శ్రీమతి కూడా వస్తారు కదా!"

"లేదు. నేను ఒక్కడ్నే వెళ్లి రావాలనుకుంటున్నాను. తను రావాలంటే ఆ చుట్టు పక్కల గుడులన్నీ తిరగాలంటుంది. అది ఇంకోసారి పెట్టుకుంటాం" అన్నాడు.

"నీ ఇష్టం" అన్నాడు నిరంజన్.

ఇంటి దగ్గర కళ్యాణి నిరుత్సాహపడింది.

"మీరు ఒక్కరే వెళ్లటం ఏమిటి? వేసవి సెలవుల్లో పిల్లలు వస్తారు. అప్పుడు అందరం వెళ్దాం" అంది.

"అప్పుడు కావాలంటే ఇంకోసారి వెళ్దాం. మా బాస్ కొత్త ప్రాజెక్ట్ తీసుకున్నారు. ఇది విజయం సాధించాలి. నేను ఈ మధ్యన తిరుమల వస్తాను అని మనసులో అనుకున్నాను. దర్శనం అవగానే బయలుదేరి వస్తాను. కేవలం రెండు రాత్రుల ప్రయాణం".

"తలనీలాలు ఇస్తున్నారా?"

"అవును"

"మీ కెందుకు ఇంత సడన్ గా తిరుమల వెళ్లాలి అనిపించింది?"

"ఎందుకో అనిపించింది. అసలు నా పేరు వెంకటాద్రి. ప్రతి ఏటా నన్ను తిరుమల వెళ్లమని మా అమ్మ చెప్పేది.. మనకు కుదరదు. చూద్దాం. ఇక నుండి సంవత్సరానికోసారి వెళ్లి రావటానికి ప్రయత్నం చేస్తాను" అన్నాడు.

తిరుమల ప్రయాణం రైలులోనే. అక్కడికి మనుషులు వచ్చారు. కారులో సరాసరి కొండలపైకి తీసుకు వెళ్లారు. అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చేయించారు. నిరంజన్ కి ఎంత పలుకుబడి వుందో అర్థం అయింది. గుండు చేయించుకున్నాడు. దొరికిన డబ్బులో పాతిక వేలు హుండీలో వేశాడు. స్వామి ముందు చేతులు జోడించాడు.

"అయ్యా... నేను నిమిత్తమాత్రుడ్ని. ఇటీవల జరిగినవన్నీ నీకు తెలుసు. ఇన్నేళ్లకి నా మీద నీ కరుణ కురిసింది. ఆ డబ్బుని నాకు నువ్వు పంపావు. దానిని వ్యాపారంలో పెట్టే ముందు నీ ఆశీస్సుల కోసం వచ్చాను. మీ దీవెనలు వుంటే నా జీవితం మరో మలుపు తిరుగుతుంది. నన్నూ, నా కుటుంబాన్ని చల్లగా చూడు. ఇంక ఇలా చేయటం పాపమా, స్వార్థమా అన్న మీ మాంసలో పడ్డాను. నేను ఎవర్నీ మోసం చేయలేదు. దారి కాచి దోపిడి చేయలేదు. అప్పటికీ ఎవరన్నా ఈ డబ్బు పోగొట్టుకున్నారా అని ఇన్ని రోజులు ఎదురు చూశాను. ఈ డబ్బుని పదింతలు చేసినా, సొంతం నష్టపోయినా నేను బాధపడను. నేను కోరుకునేది ఒక్కటే. అహంకారం నా తలకు ఎక్కకుండా నన్ను కరుణించు" అని వేడుకున్నాడు.

అప్పటిదాకా చిన్న చిన్న సందేహాలుంటే అవన్నీ పక్కకి తొలిగిపోయాయి. ఇప్పుడు వెంకటాద్రి ముఖంలో కొత్త తేజం వచ్చింది.

కళ్యాణి అన్నయ్య హైదరాబాద్ వచ్చాడు. వెంకటాద్రి తిరుమలకి వెళ్లాడు అని తెలిశాక "బావతో మాట్లాడాలని వచ్చానే" అన్నాడు.

"ముందు ఫోన్ చేసి రావల్సింది. అయినా రేపు వస్తారు" అంది కళ్యాణి.

"నిజమే. ఇంకెవరితోనో కారులో వచ్చాను. మా స్నేహితుల అమ్మాయి పెళ్లి. రాత్రికి అది చూసుకుని కారులో వెళ్తాం".

"ఏ విషయం గురించి మాట్లాడాలి?"

"కొంత డబ్బు కావాలనుకున్నాను కదా!"

"అది నేను మాట్లాడాను తమ్ముడూ. మనలో మన మాట. బావగారి ఆఫీస్ బాస్ బెంగళూరులో ఈ మధ్య భూములు తీసుకుంటూ వాటా ఇస్తాను అన్నారు. ఇక్కడ ఇల్లు తీసుకుందాం అనుకున్నాం కదా. దాని సంగతి తర్వాత ముందు అక్కడ పెట్టుబడి పెడితే అన్న ఆలోచన వచ్చింది".

"భూమి మీద పెట్టుబడి పెడితే బాగానే వుంటుంది. అందులో నష్టం రావటానికి అవకాశం తక్కువ. ఏ మాత్రం పెట్టాలనుకుంటున్నారు?"

"అదింకా నిర్ణయించుకోలేదు. అయితే ఓ మాట అన్నారు. నీ దగ్గర బంగారం వుంది కదా. అది బ్యాంకులో పెట్టుకోమని మీ తమ్ముడికి చెప్పు అని. ఇప్పుడు నీకు అవసరం రాదు అనుకున్నాను".

"అంటే వనిత పెద్దమ్మ ఆస్తి వచ్చిందనా! అవన్నీ ఇప్పుడు అమ్మటానికి కాదక్కా. ఏం చేయాలన్నా ఆమె బతికి వున్నంత వరకు కుదరదు. ఇప్పుడు అత్తయ్యని ఇంటికి తీసుకురావాలి. ఆవిడ ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగా వుంది. ముందు అన్ని పరీక్షలూ చేయించాలి".

"వయసు పెరుగుతుంది కాబట్టి చిన్న చిన్న సమస్యలు వుంటాయి. అంతకు మించి ప్రమాదం వుండదులే".

"అని మనం ఎలా చెప్పగలం. రోగం పెద్దది కావచ్చు. చిన్నది కావచ్చు. ముందు గుంటూరులోనే చూపించాలనుంది. ఆ తర్వాత కదా తెలిసేది".

"అదీ విషయం. నీకు డబ్బులు కావాలంటే మన దగ్గరున్న ఆధారం అది".

"నీ బంగారం తాకట్టు పెట్టటం ఎందుకులే?"

"అవసరానికి తాకట్టు పెట్టడానికే బంగారం వుంది".

"చూద్దాంలే. నేను అవసరం అనుకుంటే అప్పుడు మళ్లీ రావటమో, ఫోన్లో మాట్లాడటమో చేస్తాను. నువ్వు ఈ విషయం గురించి బావతో అనకు. పెళ్లికని వచ్చి వెళ్లాడని చెప్పు" అన్నాడు ఆనందరావు.

తిరుపతి నుండి వచ్చాక లడ్డూ ప్రసాదాలు తీసుకుని నిరంజన్ ని ఆఫీస్ లోనే కలిశాడు. దర్శనం బాగా జరిగిందా అనడిగాడు నిరంజన్. గుండులో కొత్తగా కనిపిస్తున్నాడు. అంతకు ముందు వెంకటాద్రివి గొప్ప కేశాలు కాదు. బట్టతల రాలేదు. పలచగా వున్న వాటిని కవర్ చేస్తుండేవాడు.

చాలా బాగా దర్శనం అయిందని చెప్పాడు వెంకటాద్రి.

"ఇంతకు ముందు మీరు నాకు ఆఫర్ ఇచ్చారు. ఇన్ని రోజులూ నేను ఆ విషయం గురించి మాట్లాడలేదు. ఇప్పుడు నేను మీరిచ్చే అవకాశాన్ని ఉపయోగించుకోవాలనుకుంటున్నాను".

"గుడ్" అన్నాడతను.

"మీకు అదే మన ఫర్మ్ కి ఇన్వెస్ట్ చేయాలంటే అంతా వైట్ కావాలా?"

"నీ దగ్గర బ్లాక్ మనీ వుందా?"

"బ్లాక్ మనీ నా దగ్గర వుండదు. మీకు తెలుసు. నేను ఉద్యోగంతో సరిపెట్టుకున్నాను. ఎలాంటి వ్యాపారం చేయలేదు. నాకు నాలుగెకరాల పొలం వుంది. దాని మీద ఎప్పటి నుండో ఎంతో కొంత ఆదాయం వస్తోంది. అలాగే మాకు మొదట్లో బోనస్ లు యిచ్చేవారు. అవన్నీ నా శ్రీమతి బంగారం మీద పెట్టింది".

"మధ్య తరగతి వాళ్లు ఎక్కువగా బంగారం మీదే పెట్టుబడి పెడతారు. ధర పెరుగుతూనే వుంది కదా. ముందు ముందు ఇంకా పెరుగుతుంది. అయితే షేర్ మార్కెట్ లా బంగారానికి చిన్న చిన్నవో పెద్దవో కుదుపులుంటాయి".

"అవును".

"ఏ మాత్రం పెట్టాలనుకుంటున్నావు?"

"ముందు ఇరవై అయిదు లక్షలు అనుకుంటున్నాను. నాకు చిన్న చిన్న మొత్తాలు బయట నుండి రావాలి. ఒకటి రెండు చిట్స్ నడుస్తున్నాయి. అవన్నీ చూసుకుని మరో ఇరవై అయిదు లక్షల దాకా పెట్టాలనుకుంటున్నాను".

"బాగుంది. నువ్వు ఎంత వైట్ ఇవ్వగలిగితే అంత ఇవ్వు. అవన్నీ మన ఆడిటర్ చూసుకుంటాడు. బ్లాక్ లో అదే లెక్కల్లోకి రాని డబ్బులుంటే వాటిని డెవలప్ మెంట్ కి ఖర్చు చేద్దాం. ముందు నీ కంటూ ఓ ఎకౌంట్ ని బిల్డప్ చేద్దాం. సబ్ కాంట్రాక్టులు చేద్దువుగాని. నీ రిటైర్ మెంట్ డబ్బు వుంది కదా".

"అవును నిరంజన్ గారూ".

"ఓ ఫర్మ్ ని రిజిస్టర్ చేయించుదాం. అవన్నీ మన ఆడిటర్ చూసుకుంటారు. అది మీ పేరుతో వుంటుంది. భాగస్వామిగా మీ శ్రీమతిని జాయిన్ చేసుకోవచ్చు. మంచి పేరు అనుకోండి. అది రిజిస్టర్ చేద్దాం".

"అలాగే"

"ముందయితే నేను క్యాష్ గా ఓ పాతిక లక్షలు యిస్తాను".

"నో ప్రాబ్లమ్... " అని, "వెంకూ... ఈ విషయం మన ఆఫీస్ లో ఎవరితోనూ అనకు. ఇలాంటివన్నీ బయటకు చెప్పకూడదు. ముందు జెలసీ ఫీల్ అవుతారు. అలాగే నువ్వు ఇచ్చే ప్రతి రూపాయికి లెక్క వుంటుంది. నీకు రిసిప్ట్ లు వుంటాయి. వాటిని ఎలా ఇన్వెస్ట్ చేస్తున్నామో నీకు తెలుస్తుంది. ఆ ఎకౌంట్స్ ఆడిటర్ కి మనకీ మధ్య వుంటాయి".

"నాకు మీ మీద నమ్మకం వుంది నిరంజన్ గారూ... మీకు ఈ ఆలోచన ఎందుకు వచ్చిందో నాకు తెలియదు. అయినా ఇది మీకు చిన్న ఎమౌంట్. మనను అభిమానించే మనుషులు దొరకటం అదృష్టం అంటారు".

"నేను ఇంతకు ముందు చెప్పాను వెంకూ... నేను కూడా మీలానే జీవితం మొదలు పెట్టాను. నన్ను కొంత మంది ప్రోత్సహించారు. అలా పైకి వచ్చాను. వారి పేర్లను నేను మరిచిపోను. అలాంటి తృప్తి నాకు కూడా కావాలి. నేను కూడా కనీసం ఒకరిద్దరికి లిఫ్ట్ ఇవ్వాలి. ఇదీ నేను అనుకున్నాను. ఇదేదో మీరు చూసుకోండి. ఆడిటర్ కి చెబుతాను. వారితో మాట్లాడి ఆ పనిలో వుండండి" అన్నాడు నిరంజన్.

ఛాంబర్ నుండి బయటకు వచ్చాడు. ఇప్పుడు మనసులో తృప్తిగా అనిపించింది. ముందు ఇంటి నుండి సగం డబ్బుని బయటకు పంపాలి. అప్పుడు గుండెల మీద భారం తగ్గుతుంది. ఇంతకూ ఫర్మ్ ఎవరి పేరు మీద వుంటే బాగుంటుంది అనుకున్నాడు. పిల్లలు, కళ్యాణి గుర్తు వచ్చారు. అలాగే వెంకటేశ్వర స్వామి. ఈ అందరి పేర్లలో ఓ అక్షరం తీసుకుని ఏర్పాటు చేద్దాం అనుకున్నాడు. అలాగే ఈ విషయం ఇంట్లో చెప్పకూడదని నిర్ణయం తీసుకున్నాడు. అలా చెప్పటం వలన కళ్యాణి రకరకాల ప్రశ్నలు అడుగుతుంది. తను ఇంటర్ మీడియట్ వరకు చదువుకుంది. అసలు ఏ విషయం అర్థం కాదని కాదు. ఎంత వద్దనుకున్నా ఇలాంటి విషయాలు లీక్ అవుతాయి. చివరకి శివకృష్ణతో కూడా ఈ విషయం మాట్లాడకూడదు. అతనితో సంబంధాలు ఆర్థిక పరమైన లావాదేవీలకు అతీతం.

'కేవలం వ్యక్తిగతం' అనుకున్నాడు.

పనులు మొదలు అయ్యాయి. ఎ.కె.డి.వి. అనే అక్షరాలను వెంకటాద్రి ఓ క్రమంలో అనుకున్నాడు. ఆడిటర్ తో మాట్లాడుతున్నాడు. అది పది రోజుల్లోనే రిజిస్టర్ అయింది.

ఆ రోజు నిరంజన్ ని అడిగాడు. ఆదివారం మీ ఇంటికి వస్తున్నాను. క్యాష్ తీసుకువస్తాను అని. కారు పంపించమంటావా అన్నాడు. నేను క్యాబ్ బుక్ చేసుకు వస్తాను అందామనుకున్నాడు. అయితే ఆ ఆలోచనని విరమించుకున్నాడు. తమ ఇంటి నుండి నిరంజన్ ఇంటికి ఇరవై కిలో మీటర్ల దూరం. మామూలుగా అయితే పది కోట్లు అయినా కారులో తీసుకు వెళ్లవచ్చు. అది ఆఫీస్ డబ్బు. దానికి లెక్క వుంటుంది.

అయినా మధ్యలో ఎవరయినా ఆపవచ్చు. చెక్ చేయవచ్చు. అది లెక్కలున్న డబ్బయినా ముందు తలనొప్పులు భరించాలి. అందుకని నిరంజన్ ప్రతిపాదనకి అంగీకారం తెలిపాడు. డ్రైవర్ తో మాట్లాడమన్నాడు.

ఆ రాత్రి కళ్యాణిని ఏదో పని మీద బయటకు పంపాడు. అటక మీద నుండి సూట్ కేసు దింపాడు. అందులో నుండి పాతిక లక్షలు తన బ్యాగ్ లో సర్ది మళ్లీ సూట్ కేస్ ని అటక మీద పెట్టాడు. తన బ్యాగ్ లో డబ్బు మీద ఫైల్స్ రెండు పెట్టాడు.

ఆదివారం ఉదయం ఇంటి ముందు కారు ఆగటం చూసి కళ్యాణి ఆశ్చర్యపోయింది. ఇలా వస్తుందని వెంకటాద్రి చెప్పలేదు. అతను బ్యాగ్ తీసుకుని బయలుదేరుతుంటే తటపటాయిస్తూనే అడిగింది.

''మీరు బెంగళూరు వెళ్తున్నారా?''

''కాదు. మా బాస్ ఇంటికి వెళ్తున్నాను''.

''బ్యాగ్ తో వెళ్తుంటేనూ''.

''ఇందులో ఆఫీస్ కి చెందిన ముఖ్యమైన ఫైల్స్ వున్నాయి''.

''భోజనానికి వస్తారా?''

"చూద్దాం. త్వరగా పని అయిపోతే వస్తాను. ఏ విషయం నీకు ఫోన్ చేసి చెబుతాను" అన్నాడు. తన కళ్ల ముందు వెంకటాద్రి వెళ్తుంటే ఏదోలా అనిపించింది. తన దగ్గర ఏమైనా దాస్తున్నాడా? అందులో వుంది ఫైల్సేనా... ఇంటిలో కొన్ని ఫైల్స్ వుంటాయి. వాటిని తాను పట్టించుకోదు. ముందు నుండి ఆఫీస్ విషయాలను ఇంటికి తీసుకురావటం వెంకటాద్రికి అలవాటు లేదు. కారు డ్రైవర్ బ్యాగ్ ని అందుకుని ఢిక్కీలో పెట్టాడు. అది తన పక్కనే వుంచుకోవాలనుకున్నా మాట్లాడలేకపోయాడు.

కారు బయలుదేరే ముందు వెంకటాద్రి డోర్ తెరిచి చెయ్యి వూపుతాడనుకుంది. అతని ఆలోచనల్లో అతనున్నాడు. కాస్త నిరాశగా అనిపించింది.

పది కిలోమీటర్ల ప్రయాణం. వెంకటాద్రికి భారంగా సాగింది. కారు నిరంజన్ ఆవరణలోకి ఆగేదాకా అలానే ముళ్ల మీద కూర్చున్నట్లు వుండిపోయాడు. అతన్ని గెస్ట్ రూమ్ లో కూర్చో బెట్టాడు. నిరంజన్ ఫోన్ లో మాట్లాడుతూనే పది నిముషాల్లో వచ్చాడు. కాఫీలు వచ్చాయి. వాటిని తాగారు. తర్వాత నోట్ల కట్టలను టేబుల్ మీద పెట్టాడు.

"ప్యాక్ చేయకపోయావా?"

"మళ్లీ కౌంట్ చేయాలి కదా నిరంజన్ గారూ... "

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS